తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-30- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 151 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in





# తెలంగాణ మొత్తాన్ని తడిపిముద్ద చేసిన మొంథా తుఫాన్

- హైదరాబాద్‌లో నీటమునిగిన రహదారులు
- గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం
- ప్రమాద హెచ్చరికలు, అధికారుల సన్నద్ధత
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మొంథా తుఫాన్ ప్రభావంతో మొత్తం తెలంగాణ రాష్ట్రం వర్షాల ముంపులో కొట్టుకుపోయింది. ఉదయం నుంచే ప్రారంభమైన భారీ వర్షాలు మధ్యాహ్నానికి మరింత తీవ్రతరమయ్యాయి. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నల్గొండ, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. రాజధాని హైదరాబాద్‌లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా కనిపించింది. బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, దిల్‌సుఖ్‌నగర్, ఎర్రమంజిల్, మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురిశాయి.

మిగతా 2లో

# మొంథా తుపాన్ ప్రభావంపై సీఎం రేవంత్ సమీక్ష

- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు
- రైతుల పంటలకు రక్షణ చర్యలు
- రైళ్ల రాకపోకల్లో అంతరాయం
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి



రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుపాన్ ప్రభావం తీవ్రంగా కనిపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులు, శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతుల ధాన్యానికి హాని కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో తుపాన్ ప్రభావం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో తుపాన్ ప్రభావం అధికంగా ఉందని, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దారిమళ్లించారని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు వారికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వాగులు, వంకలు పొంగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా చెప్పారు.

మిగతా 2లో



# హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ సెంటర్ ప్రారంభం

- హైదరాబాద్‌పై అంతర్జాతీయ నమ్మకం
- సాంకేతిక రంగానికి కొత్త ఊపిరి
- తెలంగాణ అభివృద్ధికి ప్రతీక
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ ఐటీ హబ్ హైటెక్ సిటీలో అమెరికా వెలుపల మెక్‌డొనాల్డ్స్ సంస్థకు అతిపెద్ద గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ప్రారంభమైంది. ఈ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంయుక్తంగా ప్రారంభించారు. 1.56 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఆధునిక సౌకర్యం, మెక్‌డొనాల్డ్స్ సంస్థ గ్లోబల్ ఆపరేషన్లకు కేంద్రంగా ఉండనుంది. ఇది తెలంగాణలోని సాంకేతిక మౌలిక సదుపాయాలపై అంతర్జాతీయ కంపెనీలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సెంటర్ స్థాపన హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల రాజధానిగా నిలబెట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు.



మిగతా 2లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో

# కాంగ్రెస్ విజయమే ఖాయం

- ఇందిరమ్మ ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యం
- బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డ పొంగులేటి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని కార్మికనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. వర్షం మధ్య జోరుగా సాగిన ప్రచారంలో ప్రజల ఉత్సాహం కాంగ్రెస్ గెలుపునకు సంకేతమని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన 300 పైగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే బాలునాయక్, వేముల వీరేశం, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు. గతంలో స్వర్గీయ పీ.జనార్దన్ రెడ్డి జూబ్లీహిల్స్ పేదల అభ్యున్నతికి కృషి చేశారని, పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలను అందజేశారని పొంగులేటి గుర్తుచేశారు. ఆ కాలం నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షాన నిలిచిందని తెలిపారు. గత 21 నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అనేక పథకాలను ప్రారంభించిందని

మిగతా 2లో





## మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి సత్యనారాయణరావుకు

# మహేశ్‌కుమార్ గౌడ్ నివాళులు

సిద్దిపేట, (తెలంగాణ ముచ్చట్లు):

మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి దివంగత సత్యనారాయణరావు స్మారకార్థం మహేశ్‌కుమార్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సత్యనారాయణరావు ఫోటోకు పూలమాలలు సమర్పించి, మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి

మిగతా 2లో



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, అధికారులు అందుబాటులో ఉండాలి

మంత్రి సీతక్క

ములుగు, (తెలంగాణ ముచ్చట్లు):

మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో దానసరి సీతక్క ప్రజలను అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశించినట్లు సీతక్క తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని



సూచించారు. "ప్రజలు బయటకు వెళ్ళకుండా, అత్యవసరమైతే మాత్రమే

మిగతా 2లో

# వర్షపు నీరు రోడ్లపై కాదు.. పైపులైన్‌లలో పారాలి

- హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్
- లకడికాపూల్‌లో వర్షాల వేళ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

'మోంథా' తుపానుతో నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్ లు బుధవారం లకడికాపూల్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. వర్షపు నీరు నిలిచిపోవడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం వంటి అంశాలను పరిశీలించిన అధికారులు, తక్షణ చర్యలు



మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ మొత్తాన్ని తడిపిముద్ద చేసిన మొంథా తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

చిన్న వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు నీటమునిగాయి. రైతులు భయాందోళనలో ఉన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి, ఎటూరునాగారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుఫాన్ ప్రభావం కొనసాగనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రానున్న 24 గంటల్లో వర్షాలు కొనసాగవచ్చని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అధిక వర్షపాతం ఉండే అవకాశముంది. జిల్లా కలెక్టర్లు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయి. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని ప్రభుత్వం సూచించింది. చిన్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. చేపల వేటకు వెళ్లకూడదని, పంటలను రక్షించుకోవడంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన. మొంథా తుఫాన్ ప్రస్తుతం తెలంగాణ మధ్య ప్రాంతాల మీదుగా కదులుతూ ఉత్తర దిశగా పయనిస్తోంది. రాత్రికి దాని ప్రభావం మరింత విస్తరించవచ్చని అంచనా. వాతావరణ పరిస్థితులు



చల్లబడడంతో పలు ప్రాంతాల్లో గాలివానలు కూడా నమోదయ్యాయి. మొత్తానికి, మొంథా తుఫాన్ తెలంగాణను వర్షాల రాష్ట్రంగా మార్చేసింది. ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధంగా ఉన్నా, ప్రజలు అప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరం.

# మొంథా తుపాన్ ప్రభావంపై సీఎం రేవంత్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



నీటి పారుదల శాఖ అధికారులు చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల నీటి మట్టాన్ని నిరంతరం పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువుల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, నీటి విడుదలపై ముందస్తు సమాచారం కలెక్టర్లకు ఇవ్వాలని సూచించారు. లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, నీరు నిలిచిన రోడ్లపై రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సీఎం ఆదేశించారు. వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, క్రిమికీటకాలు పెరగకుండా నగర, గ్రామ స్థాయిలో పారిశుద్ధ్య పనులు తక్షణమే చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. వైద్య శాఖ తగినంత మందులు సిద్ధంగా ఉంచి, అవసరమైతే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల వినతులకు ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆయన సూచించారు.

# హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ సెంటర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రగతిశీల విధానాలు, పారదర్శక పాలన, ఇన్నోవేటివ్ అర్బన్ ఈకోసిస్టమ్ ప్రపంచ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్నాయని చెప్పారు. మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ ద్వారా టెక్నాలజీ, ఎంటర్‌ప్రైజ్ ఆపరేషన్స్, మద్దతు రంగాలు మరింత బలపడతాయని తెలిపారు. ఇది కొత్త పెట్టుబడులను ఆకర్షించి, వేలాది ఉద్యోగాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ సాంకేతిక రాజధానిగా ఎదగడం దశాబ్దాల క్రితం మొదలైన దూరదృష్టి పెట్టుబడుల ఫలితమని భట్టి విక్రమార్క అన్నారు. సమానాభివృద్ధి, సమగ్ర వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్స్ సెంటర్ స్థాపనతో నగరం గ్లోబల్ టెక్ మాప్‌లో మరింత బలంగా నిలబడిరదని, ఇది "తెలంగాణ ప్రగతిశీల పాలనకు, సాంకేతిక దిశగా ముందడుగు వేసిన రాష్ట్రం" అని ప్రతిబింబిస్తోందని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు.



# తెలంగాణ రైజింగ్‌కి నిదర్శనం : సీఎం రేవంత్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ప్రారంభమైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంస్థ బృందానికి అభినందనలు తెలిపారు. ఇది "తెలంగాణ రైజింగ్‌కి నిదర్శనం" అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన మెక్‌డొనాల్డ్స్ సంస్థ హైదరాబాద్‌ను తమ గ్లోబల్ సెంటర్ స్థాపనకు ఎంచుకోవడం రాష్ట్ర ఐటీ శక్తికి నిదర్శనమని సీఎం అన్నారు. ఈ కేంద్రం ప్రారంభం తెలంగాణను అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా మరింత బలోపేతం చేస్తుందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌పై మెక్‌డొనాల్డ్స్ చూపిన నమ్మకం నగరాన్ని గ్లోబల్ టెక్ డెస్టినేషన్‌గా నిలిపిన ప్రతిష్టను మరింతగా పెంచిందని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు.

## మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి సత్యనారాయణరావుకు

# మహేశ్‌కుమార్ గౌడ్ నివాళులు

(మొదటి పేజీ తరువాయి)



సానుభూతి తెలిపారు. బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సత్యనారాయణరావు ప్రజా సేవలో నిబద్ధతతో పని చేసిన వ్యక్తి అని, ఆయన విలువలు హరీశ్ రావు ద్వారా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సత్యనారాయణరావు మరణం సిద్దిపేట ప్రజలకు, కుటుంబానికి అపూర్వ నష్టం అని చెప్పారు. అంతేకాక, సమాజంలో మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, మానవీయత విలువలను బోధించిన వ్యక్తిగా ఆయన స్మరించదగిన వారని అన్నారు. హరీశ్ రావు కుటుంబం ఈ కష్ట సమయంలో ధైర్యంగా నిలవాలని, దేవుడు వారికి శాంతి ప్రసాదించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అనేక మంది అభిమానులు కూడా ఈ సందర్భంగా హాజరై పూలమాలలు సమర్పించి సత్యనారాయణరావు గారికి నివాళులు అర్పించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ కంటతడి పెట్టారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, అధికారులు అందుబాటులో ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లను విడిచి బయటకు రావాలి. వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లకూడదు. అధిక నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి" అని సీతక్క ప్రజలకు సూచించారు. అలాగే, వ్యవసాయ కూలీలు, రైతులు, పశుపాలకులు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటలు, పశువులు సురక్షితంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. "మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదు, తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సహనంతో ఉండాలి" అని హితవు పలికారు. తుఫాన్ ప్రభావం కారణంగా చల్లని గాలులు వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సీతక్క తెలిపారు. "ప్రజల ప్రాణం మాకు ముఖ్యమైంది. అందరూ ప్రభుత్వ సూచనలను కచ్చితంగా పాటించాలి" అని ఆమె స్పష్టం చేశారు.



# వర్షపు నీరు రోడ్లపై కాదు.. పైపులైన్‌లలో పారాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. మాసబ్ ట్యాంక్ నుంచి లకడికాపూల్ వైపు వస్తూ మెహిదీ ఫంక్షన్ హాల్ వద్ద రహదారిపై నీరు నిలిచిపోవడం గమనించిన కమిషనర్లు, ఆ సమస్యకు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వ వల్ల తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించి, వెంటనే నీటి పారుదల మార్గాలను శుభ్రం చేయాలని, పైపులైన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే అక్కడ రెండు అడుగుల విస్తీర్ణంలో పైపులు వేసినప్పటికీ, మహావీర్ ఆసుపత్రి, చింతలబస్తీ ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీటిని ఆ పైపులతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ఈ పనులను



త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మహావీర్ ఆసుపత్రి నుంచి మెహిదీ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు పక్కనున్న పైపులైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తే సమస్య గణనీయంగా తగ్గుతుందని వారు సూచించారు. "రెండు రోజుల్లోపే పనులు పూర్తి చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి" అని కమిషనర్లు స్పష్టంగా ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ పోలీసుల సహకారంతో పైపులైన్ అనుసంధాన పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పరిశీలనలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ తదితర అధికారులు కూడా పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో

# కాంగ్రెస్ విజయమే ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

పొంగులేటి వివరించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా ఇళ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నవారికి రెవెన్యూ శాఖ మంత్రిగా తాను స్వయంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత పది సంవత్సరాల పాటు బీఆర్ఎస్ పాలన తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని, పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. "పేదలకు ఒక గూడు కట్టించాలన్న ఆలోచన రాలేదు కానీ కమిషన్ల కోసం కాళేశ్వరం




కట్టారు" అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా నిలిచి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రతి ఓటు వేయాలి" అని జూబ్లీహిల్స్ ఓటర్లను పొంగులేటి కోరారు. "ఈ ఉపఎన్నిక ఫలితం ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలవాలి" అని ఆయన అన్నారు.

# ప్రజల్లో తిరిగే అభ్యర్థిదే గెలుపు

- జూబ్లీహిల్స్‌లో బీజేపీ జయపథం ప్రారంభం
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం
- సమీక్షా సమావేశంలో కీలక నాయకుల ఆత్మవిశ్వాసం

హైదరాబాద్, అక్టోబర్ 29 :

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు న్యాయవాది రాం చంద్రరావు అధ్యక్షతన హైదరాబాద్ మోతీనగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ వివిధ విభాగాలు, మోర్చాలు, శక్తికేంద్ర సమన్వయకర్తలు, ఇన్‌చార్జీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి %ద% రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, జూబ్లీహిల్స్ అభ్యర్థి లక్ష్మణ్ దత్తాత్రేయ రేడి (ఎల్‌డీఆర్), ఎంపీ రఘునందన్ రావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే సీఎం రకరకాల వాగ్దానాలు చేస్తున్నారని, ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ బీజేపీ అభ్యర్థి మరియు ఎంఐఎం మద్దతుతో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి మధ్యనే ఉంటుందని వారు స్పష్టం చేశారు. "పోలీస్ స్టేషన్ బయట తిరిగే అభ్యర్థి వద్దు, ఎప్పుడూ ప్రజల్లో తిరిగే అభ్యర్థి కావాలి ం అందుకే ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు" అని నాయకులు తెలిపారు. కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలి. ప్రజల నమ్మకమే మా బలం. విశ్వాసంతో ముందుకు సాగితే, జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలుపు ఖాయం అని నేతలు ఉత్సాహపరిచారు.








# పగిడేరు వాగు వరద ప్రవాహన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 29, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. బుధవారం కొణిజర్ల మండలం లాలాపురం తీగలబంజారా వద్ద గల పగిడేరు వాగు వరద ప్రవాహన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. కొనిజర్ల మండలం అంజనాపురం వద్ద నిమ్మవాగులో డీసీఎం వ్యాన్ పడిపోవడంతో స్థానిక పోలీసులను ఎన్డీఆర్ఎఫ్ బృందలను అప్రమత్తం చేశారు. జిల్లాలో రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతం గాప్రవహిస్తుండటంతో నీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా మున్నేరు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలు కూడా అపప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# ఖమ్మంలో కదులుతున్న రైలులో ప్రత్యక్షమైన కొండ చిలువ

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 29, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం లో కొండ చిలువ కలకలం రేపింది. కదులుతున్న రైలులో ఓ కొండ చిలువ ప్రయాణీకులను భయభ్రాంతులకు గురిచేసింది. రైల్వే పోలీసులు సకాలంలో స్పందించి కొండ చిలువను పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వరంగల్ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో అండమాన్ ఎక్స్‌ప్రెస్‌లో ఎస్ 2 ఏసీ బోగీలో మూత్రశాల వద్ద కొండ చిలువను చూసిన ప్రయాణీకులు భయాందోళనలకు గురయ్యారు. బిగ్గరగా కేకలు పెట్టారు. టిటిఇ అక్కడకు చేరుకుని పామును గుర్తించి సమీప రైల్వే స్టేషన్ ఖమ్మం ఆర్‌పిఎఫ్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఖమ్మం నగరానికి చెందిన పాములు పట్టే మస్తాన్ అనే వ్యక్తిని పిలిపించారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌లో రైలు ఆగగానే రైల్వే పోలీసులు మస్తాన్ బోగి వద్దకు వెళ్లి కొండ చిలువను పట్టుకున్నారు.



# ఏఐపిసి రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి నియామకం

### మర్యాదపూర్వకంగా కలిసిన వికలాంగుల సంఘం అధ్యక్షులు గంజాయి రమేష్

**వనపర్తి, అక్టోబర్ 29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా యువ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి ని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి) రాష్ట్ర అధ్యక్షుడిగా అధిష్టానం నియమించింది.

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రధాన అతిథిగా హాజరై, కార్యకర్తలకు ప్రోత్సాహం అందిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న డాక్టర్ ఆదిత్య రెడ్డి గతంలో ఏఐటిసి హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ నేషనల్ హెడ్ గా సేవలందించారు. వనపర్తి నియోజకవర్గంలో యువ నాయకుడిగా ప్రజల్లో విశ్వాసం సంపాదించిన ఆయనకు పార్టీ అధిష్టానం రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా వనపర్తి జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షులు గంజాయి రమేష్‌డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. అధ్యక్షులు మాట్లాడుతూ.. ఆదిత్య రెడ్డి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎం. దేవన్న యాదవ్, మున్నూరు జయకర్, పి. యాదగిరి, అజీమ్ తదితరులు పాల్గొని డాక్టర్ ఆదిత్య రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మొంథా తుఫాన్ ప్రభావంతో సత్తుపల్లి సింగరేణి గనుల్లో ఉత్పత్తి అంతరాయం





**సత్తుపల్లి, అక్టోబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** మొంథా తుఫాన్ ప్రభావంతో సత్తుపల్లి పరిధిలోని సింగరేణి బొగ్గు గనుల్లో భారీ వర్షాలు కురవడంతో ఉత్పత్తి కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జె.వి.ఆర్. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ప్రాంతంలో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, దాంతో సుమారు 1.50 లక్షల ఘన మీటర్ల మట్టి (ఓ.బి) మరియు 25 వేల టన్నుల బొగ్గు తడిసి పనులు నిలిచిపోయాయి.అలాగే, కిష్టారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు పరిధిలో 29 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, సుమారు 50 వేల ఘన మీటర్ల మట్టి (ఓ.బి) మరియు 10 వేల టన్నుల బొగ్గు ప్రభావితమయ్యాయి.వర్షం కారణంగా గనుల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో యంత్రాలు కదలలేని పరిస్థితి ఏర్పడింది. వర్షపు నీటిని తొలగించే పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వాతావరణం అనుకూలించిన వెంటనే ఉత్పత్తి పునఃప్రారంభిస్తామని సింగరేణి అధికారులు స్పష్టం చేశారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి





**పెద్దమందడి,అక్టోబర్29(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు పండించిన వరి ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. దళారులను నమ్మి మోసపోకూడదని, రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్,మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శాఖ వెంకటయ్య, చేనేత ఉన్నిపరిశ్రమ సంఘం ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, సత్య రెడ్డి, రామచంద్రయ్య గౌడ్, ఏపిఎం సక్కుర్ నాయక్, జిల్లా అధికారులు మహిళా సంఘం వివోఏలు శాంతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకోవాలి





### రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

**సరూర్‌నగర్, అక్టోబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల కోసం విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని, మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ యూనిఫామ్ లేని పోలీసులుగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ పిలుపునిచ్చారు. బుధవారం రోజు సరూర్‌నగర్ స్టేడియంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు కలిపి సుమారు 2,000 మంది హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రముఖ కవులు సుద్దాల అశోక్ తేజ్, సుధీర్ సంద్ర, డాక్టర్ కవిత ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థుల్లో, ప్రజల్లో చైతన్యం నింపారు.సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ ,"సమాజానికి సేవలందించి అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకోవడమే ఈ వారోత్సవాల లక్ష్యం. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రతి నిమిషానికి రెండు డయల్ 100 కాల్స్ అందుతుంటాయి. ప్రజల భద్రత కోసం పోలీసులు ఆరు విభాగాలుగా విభజించబడి విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా నిరంతరం పనిచేస్తున్నారు" అన్నారు.ఆయన మరింతగా చెప్పారు "పిల్లలకు దూరంగా ఉన్న సీనియర్ సిటిజెన్స్‌ను ఇంటింటికి వెళ్లి ఆదుకోవడం, 'ఆపరేషన్ స్మైల్' ద్వారా బాల కార్మికులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు అందించడం మా ముఖ్య లక్ష్యం. ప్రజల సహకారంతో రాచకొండ కమిషనరేట్ దేశంలో ఎన్ బి డబ్ల్యూ ఫ్రీ కమిషనరేట్‌గా నిలిచింది" అని గుర్తు చేశారు."ప్రజలకు సేవలందించే పోలీసుల సేవలను ప్రజలు గుర్తించాలి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశాం. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించడంలో రాచకొండ పోలీసులు ఎప్పుడూ ముందుంటారు" అని సిపి తెలిపారు. సుద్దాల అశోక్ తేజ్ మాట్లాడుతూ "దేశం ప్రశాంతంగా ఉండటాని కి కారణం పోలీసులే. వారిని కృతజ్ఞతతో గౌరవించాలి. ఫ్రెండ్లీ పోలిసింగ్ ఉన్నట్లే మనమూ ఫ్రెండ్లీ సిటిజెన్స్‌గా ఉండాలి"అన్నారు. సుధీర్ సంద్ర మాట్లాడుతూ "సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. డ్రగ్స్, గంజాయి, ర్యాగింగ్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలి. పోలీసుల కష్టాలను అర్థం చేసుకొని వారిని గౌరవించాలి" అని సూచించారు.తరువాత సిపి, ఇతర అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్‌స్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీలు పద్మజా ఐపీఎస్, అనురాధ ఐపీఎస్, ఆకాంక్ష్ యాదవ్ ఐపీఎస్, అరవింద్ బాబు, ఇందిరా, ఉషా రాణి, సునీత రెడ్డి, జి.నరసింహ రెడ్డి, రమణ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసులు, నాగలక్ష్మి, మనోహర్, శ్యామ్ సుందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సాకేత్ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తా- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, అక్టోబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సాకేత్ కాలనీ అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం కాప్రా డివిజన్ పరిధిలోని సాకేత్ కాలనీలో రూ.44 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు మరియు స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే ప్రధాన అతిథిగా ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ — సాకేత్ కాలనీలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని, ప్రజల అభ్యర్థనల మేరకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు భైరి నవీన్ గౌడ్, సాకేత్ కాలనీ అధ్యక్షులు జి.ఎస్. రావు, జాయింట్ సెక్రటరీ రవీందర్ రావు, కోశాధికారి చంద్రశేఖర్, రాజేశ్వర్ రావు, నిరంజన్ రావు, జగన్నాథ రావు, శ్రీనివాస రావు, సాకేత్ స్వర్ణ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి నియామకం

- ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి
- డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**వనపర్తి,అక్టోబర్29(తెలంగాణ ముచ్చట్లు):** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అనుబంధ సంస్థ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, వివిధ రంగాల ప్రొఫెషనల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకు రావాలని ప్రవీణ్ చక్రవర్తి సూచించారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని, రాష్ట్రవ్యాప్తంగా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నానని డాక్టర్ ఆదిత్య రెడ్డి తెలిపారు.

# నవంబర్ 25 లోపు షట్టర్ల అద్దె కోసం టెండర్ ఫారం సమర్పించాలి...

- ఖమ్మం డెయిరీ ఉపసంచాలకులు రవికుమార్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -29, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం డెయిరీ ఆవరణలో నిర్మించిన 10 రూముల షట్టర్లు అద్దె ప్రాతిపదికన కేటాయించుటకు గాను నవంబర్ 25 మధ్యాహ్నం 3.00 గంటలలోగా టెండర్ ఫారాలు సమర్పించాలని ఖమ్మం డెయిరీ ఉప సంచాలకులు కే. రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం డెయిరీ ఆవరణలో నిర్మించిన 10 రూముల షట్టర్లు నెలసరి అద్దె ప్రాతిపదికన కనిష్టంగా నెలకు 15 వేలు (18 శాతం జిఎస్టి తో కలిపి) చెల్లించుటకు ఆసక్తి గలవారు ఒక వేయి రూపాయలు చెల్లించి, టెండర్ ఫారాలు స్వీకరించి, పూరించిన టెండర్ ఫారాలను నవంబర్ 25 మధ్యాహ్నం 3.00 గంటలలోపు ఖమ్మం పాల కేంద్రం, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నందు సమర్పించాలని అన్నారు. కలెక్టరేట్ నందు నవంబర్ 25న సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు టెండర్లను అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో తెరవడం జరుగుతుందని, వివరాలకు 9121160585, 9959877109 నందు సంప్రదించాలని ఖమ్మం డెయిరీ ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీలను ఏకం చేయాలంటూ పిలుపు

ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, అక్టోబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సగర సంఘం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలను ఒక వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు."లౌక్యాన్ని ప్రదర్శించి, బీసీల హక్కుల సాధననే ఏకైక అజెండాగా చేసుకుని ముందుకు సాగుదాం. ఈ అంశంపై రాజకీయపరమైన భేదాలను పక్కనపెట్టి అందరం ఒకే వేదికపైకి రావాలి" అని ఆయన స్పష్టంగా చెప్పారు.రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "ప్రతిభకు కులం, పేదరికం అడ్డంకి కాదు. అసమానతలు పోవాలంటే విద్యే ఆయుధం. కానీ చదువుకున్న యువతకు ఉద్యోగం దొరకడం కష్టమైపోయింది. సమాజంలో ఉన్న అంతరాలు మరింతగా పెరుగుతున్నాయి," అని ఆయన పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్ల అమలుపై మాట్లాడుతూ "అనేక రాష్ట్రాలు 50 శాతం సీలింగ్ దాటి రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయి. తమిళనాడు ఉదాహరణగా నిలుస్తోంది. మన రాష్ట్రంలో కూడా అదే చిత్తశుద్ధితో సర్వే చేసి సుప్రీంకోర్టు ముందు సమర్థవంతంగా వివరాలు సమర్పించాలి. బీసీల జీవితాలతో చెలగాట మాడితే ప్రజలు క్షమించరు," అని హెచ్చరించారు.అలాగే ఆయన గుర్తుచేస్తూ చెప్పారు ."నేను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు బీసీలలోని చిన్న కులాల కోసం 40 రోజులపాటు అసెంబ్లీలో చర్చలు జరిపి 35 కులాలకు కుల సర్టిఫికెట్లు ఇచ్చాం. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రత్యేక అడ్మిషన్ సదుపాయాలు కల్పించాం," అని తెలిపారు.దేశంలో సామాజిక న్యాయం సాధించాలంటే జనగణన అత్యవసరమని పేర్కొంటూ "కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జనగణనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై పూర్తి వివరాలు రావాలి. అది బీసీలకు హక్కుల సాధనకు పునాది అవుతుంది," అని అన్నారు .ఈ సందర్భంగా ఆయన బీసీలకు పిలుపునిస్తూ "మనకు కావాల్సింది పోరాటం, ద్వేషం కాదు. తెలంగాణ ఉద్యమం లాగానే, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కూడా ఏకైక అజెండాతో ఉద్యమించాలి. పాలకులు ప్రేమతో సమస్యలు పరిష్కరించరు, రాజకీయ అవసరాల కోసం మాత్రమే రాయితీలు ఇస్తారు," అని వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు శేఖర్ సాగర్, రిటైర్డ్ ఐపీఎస్ రతన్, సత్య సగర, హరికిషన్ సాగర్, మారుతి సాగర్, కుమార స్వామి, సతీష్ సాగర్, స్రవంతి సాగర్, పల్లవి, సురేష్, మహేంద్ర, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్సీస్ స్కాలర్షిప్ 303 కోట్లు వెంటనే విడుదల చేయండి

- 2022 నుంచి నేటి వరకు మొత్తం బకాయిలు క్లియర్ చేయండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 29, తెలంగాణ ముచ్చట్లు;** పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీ స్కాలర్షిప్ బకాయిలు 303 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు.

నిరాశ, నిస్పృహల్లో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సీఎం ఆదేశాలు ఆనందం నింపింది. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్షిప్ పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్సీస్ స్కాలర్షిప్ అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్షిప్ అందక మరోవైపు అమెరికా, యూకే వంటి దేశంలో కొత్త కొత్త ఆంక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రమైంది.

ఆయా దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదు. అక్కడ రోజురోజుకు ఆర్థిక భారం పెరిగిపోతుంది. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నిటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ సమస్యను ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్సీస్ స్కాలర్షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డిప్యూటీ సీఎం ఆదేశాలతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థి సుమారు 20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, తమ ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికి, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్సీస్ విద్యార్థులు తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జలమయం అయిన రోడ్లు, వంతెనలు,వాగులు దాటే ప్రయత్నం చేయవద్దు
- అత్యవసర సమయాల్లో డయల్ 100, 1077
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 29, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. జిల్లాలో రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఎవరు కూడా చేపాల వేటాకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటవద్దని, యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం కూడా ఇదే పరిస్థితులు వుండే అవకాశం ఉందని వాతావరణం శాఖ హెచ్చరికల నేపథ్యంలో వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, పోలీస్ కంట్రోల్ సెల్ నెంబర్ 8712659111, కలెక్టర్ ఆఫీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1077, సెల్ నెంబరు 9063211298 సమాచారం అందిచాలని సూచించారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు సూచించామని తెలిపారు. అదేవిదంగా ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా మున్నేరు వరద ఉధృతి పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# రాజ్యాంగాన్ని గౌరవించనివారు దేశద్రోహులు

## విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ




**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 29 , తెలంగాణ ముచ్చట్లు;** భారతదేశంలో రాజ్యాంగాన్ని గౌరవించిన వారు చట్టాలకు విలువనివ్వని వారు దేశద్రోహులుగా పరిగణింపబడతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... దళితులపై ఇప్పటికి వివక్ష, అంటరానితనం, దాడులు, హత్యలు, హత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి నిత్యం సామాన్య ప్రజల మీద ఎక్కడో ఓ దిక్కు జరుగుతూనే ఉన్నాయన్నారు. మీడియా ద్వారా చూస్తూనే ఉన్నామన్నారు. దేశ అత్యున్నత వ్యవస్థ సుప్రీంకోర్టు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ మీదనే సుప్రీంకోర్టులో బూటుతో దాడి జరిగిందని ఆరోపించారు. ఆ సంఘటన దేశం, ప్రపంచంలోనే ప్రజలు నివ్వెరపోయారన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మీద దాడి జరిగి మూడు వారాలు గడుస్తున్నప్పటికీ ఢిల్లీ పోలీసులు మౌనంగా ఉన్నారు.కేసులు పెట్టలేదు.న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు తీసుకోలేదు. మానవ హక్కుల కమిషన్ స్పందించలేదు. అంటే ఈ దేశంలో దళితులకు ఇప్పటికీ రక్షణ లేదని స్పష్టంగా రుజువు అవుతుందన్నారు. దాడి చేసిన వ్యక్తి, ఆ వ్యక్తిని సమర్థించే శక్తులు సోషల్ మీడియా ద్వారా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అభిప్రాయాలను చెబుతూనే.. మేము మళ్ళీ మళ్ళీ దాడులు చేస్తామని చెబుతూనే ఉన్నారన్నారు. ధర్మం ముసుగులో, విశ్వాసాల ముసుగులో రాజ్యాంగాన్ని లెక్కచేయకుండా, చట్టాలకు విలువనివ్వకుండా దాడులు చేస్తామంటే వారు దేశ రాజ్యాంగాన్ని గౌరవించనట్లే, చట్టాలకు విలువనివ్వనట్లే కదా అని భారత రాజ్యాంగాన్ని భారత పౌరులుగా మనమే అంగీకరించకపోతే, విలువనివ్వకపోతే ఇతర దేశస్థులు ఇస్తారా అంటూ.. మనం ఈ దేశభక్తులం ఎట్లా అవుతామని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని గౌరవించేవారు, మన చట్టాలకు విలువనిచ్చేవారు దేశభక్తులు అవుతారన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించని వారు చట్టాలకు విలువనివ్వని వారు దేశద్రోహులవుతారని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని గౌరవించేవారు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేయరన్నారు. దళితుడు జస్టిస్ గవాయ్ స్థానంలో వేరే జస్టిస్ ఉంటే దాడి జరిగేనా అని ప్రశ్నించారు.? గతంలో జార్ఖండ్ రాష్ట్రంలో న్యాయవాది, న్యాయమూర్తి మధ్యన జరిగిన చిన్నపాటి వాగ్వివాదంపై న్యాయమూర్తిని అవమానించాడని ఐదుగురు జడ్జిల బృందం అర్ధగంటలో న్యాయవాదిపై కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా రౌడీషీటర్ రివాజ్ పై 40 కేసులు ఉన్నాయని, నిజాంబాద్ లో సంఘటన జరిగితే హైదరాబాద్ పోలీసు కస్టడీలో ఉన్న రివాజ్ ఎలా చనిపోతాడని మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేసిందని గుర్తుచేశారు. దీనిని బట్టి చూస్తే చీఫ్ జస్టిస్ దళితుడి మీద సుప్రీంకోర్టులో దాడి జరిగితే సుమోటోగా కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ దేశంలో ఇంకా దళితులకు జరగాల్సిన న్యాయం జరగట్లేదని, దళితులు ఏ స్థాయికి ఎదిగినా కూడా అవమానాలు దాడులు, హత్యలు, జరుగుతున్నాయన్నారు. వారికి న్యాయం జరగట్లేదని స్పష్టం అవుతుందన్నారు. అధికారాలు ఉన్న పోలీసులు, మానవ హక్కుల కమిషన్, రాజ్యాంగ సంస్థలన్నీ ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు..? దాడి చేసిన వారు స్వేచ్ఛగా ప్రెస్ మీట్లలో సోషల్ మీడియాలలో మాట్లాడుతూ.. మా విశ్వాసాల పరంగా దాడి చేశాం.. దానికి కట్టుబడి ఉన్నామని మాట్లాడుతున్నారని, ఎవరు విశ్వాసాలు వారి వ్యక్తిగతం. ఎవరి మతాలు వారు దేశంలో గౌరవించుకుంటున్నా.. రాజ్యాంగాన్ని మాత్రం అందరూ గౌరవించాల్సిందేనని స్పష్టంచేశారు. విశ్వాసాల ముసుగులో దాడులు, హత్యలు చేస్తే రాజ్యాంగం.. చట్టాలు ఎందుకని నిలదీశారు..? అందుకే దళితుడైన చీఫ్ జస్టిస్ గవాయిపై సుప్రీం కోర్టులో జరిగిన దాడిని, దళితులందరిపై జరిగిన దాడిగా పరిగణిస్తూ.. దళితుల ఆత్మగౌరాన్ని కాపాడుకోవడానికి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా జరగని నిరసన ర్యాలీ హైదరాబాదులో జరుగుతుందని, కుల, మత, రాజకీయలతీతంగా ప్రతి ఒక్కరు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఖమ్మం జిల్లా ఇంచార్జి కందికట్ల విజయ్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూరుగంటి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు చిలక నాగరాజు, గొల్లమండల ముత్తారావు, తోళ్ళ సురేష్, తూరుగంటి రాము, బాకీ శ్రీను, కనకం జనార్ధన్, చింతిరాల నాగభూషణం, కొలికపోగు ప్రభు, సూరేపల్లి నాగేశ్వరరావు, తోళ్ళ వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, పార్షపు ఇనుక, పగిడిపల్లి రవీందర్, మాదాసు వెంకన్న, లంజపల్లి భద్రం, పడిశాల నాగేశ్వరరావు, కుక్కల లక్ష్మయ్య, చిర్రా ఉపేందర్, స్వామి, చాగంటి నరసింహారావు, రాజు, నాగేశ్వర్రావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం-30- అక్టోబర్ 2025




# మాజీ మంత్రి హరీష్ రావుని పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హైదరాబాద్,అక్టోబర్29(తెలంగాణ ముచ్చట్లు):**మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పరామర్శించారు. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణం నేపథ్యంలో హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటన సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని, సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరితో పాటు చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, లింగాల ఘనపూర్ మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

# కన్నుల పండువగా దేవతామూర్తుల ప్రతిష్టాపన కార్యక్రమం





**నాగారం, అక్టోబర్ 29, (తెలంగాణ ముచ్చట్లు) :** నాగారం మున్సిపాలిటీలో ఎస్ వి నగర్ రోడ్ నెంబర్ 8 లో శ్రీ లక్ష్మీ గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజా, పుణ్యాహవాచనం, రుద్రాభిషేకం, రుద్రహోమం, చండీ పారాయణాలు, చండీ హోమం, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ బింబప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, బలిహరణ, ప్రాణప్రతిష్ఠ, కళాన్యాసం, కుంభాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. సప్త సహస్రాధిక ప్రతిష్ఠాపనాచార్యులు జక్కి కృష్ణావధాని, నరహరి అవధాని, పిరాట్ల హేమదుర్గా రామకృష్ణ శర్మ, హరిపవన కుమార శర్మలచే వింశతి (20) సంఖ్యాక ఋత్విగ్వరేణ్యులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎంవిఎల్ఎన్ శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, సహాయకులు జమ్మలమడక శ్రీరమణ శర్మ, ఆలయ అధ్యక్షులు దాచా శ్రీనివాస్ గుప్తా ఎర్రం ఈశ్వరయ్య గుప్త, లింగా నాగేంద్ర గుప్త, పీవీవీ. సత్యనారాయణ నరసింహస్వామి గౌడ్, గంగిరెడ్డి నరేందర్ రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరావు, వి. నర్సింహస్వామి గౌడ్, ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# సర్జరీ అనంతరం మృతి చెందిన ఏఆర్ పిసి చరణ్ కుమార్







## రాచకొండ సీపీ సుధీర్ బాబు నివాళులర్పణ

**హైదరాబాద్, అక్టోబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ కమిషనరేట్‌కు చెందిన ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు కానిస్టేబుల్ వి. చరణ్ కుమార్ (34) అనూహ్యంగా మరణించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీ జి ఏ బి ఎన్)లో డిప్యూటేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన, ఇటీవల ముంబై ఆపరేషన్ పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సెప్టెంబర్ 23న జరిగిన ఆ ప్రమాదం లో చరణ్ కుమార్ కాలి శిన్ బోన్ విరిగిపోయింది. మొదట స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన గాయం మానకపోవడంతో,మలక్‌పేట్ యశోద ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించారు. అక్కడ వైద్యులు చిన్న సర్జరీ అవసరమని సూచించడంతో అక్టోబర్ 16 మరియు 24 తేదీలలో రెండు సర్జరీలు చేశారు.అక్టోబర్ 24న మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఆయనను ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేశారు. ఇంటికి చేరుకున్న కొద్ది సేపటికే సుమారు మధ్యాహ్నం1.45 గంటల సమయంలో మూర్ఛపోయి పడిపోవడంతో, కుటుంబ సభ్యులు వెంటనే మళ్లీ యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయనను డాక్టర్లు మృతుడిగా ప్రకటించారు.చరణ్ కుమార్ ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరుల్లో తీవ్ర విషాదాన్ని నెలకొలిపింది. ఆయన వయస్సు 34 సంవత్సరాలు. వెనుక భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.మరణవార్త తెలిసిన రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ బుధవారం రోజు యశోద ఆసుపత్రికి వెళ్లి చరణ్ కుమార్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ తరపున అన్ని విధాల సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

# వ్యవసాయ రంగం సంక్షోభం - రైతు భవిష్యత్తు ఎటు?



భారతదేశం ఒక వ్యవసాయ ప్రధాన దేశం. దేశ జనాభాలో సుమారు 55 శాతం మంది నేరుగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడిపోతున్నారు. కానీ ఈ రంగం ప్రస్తుతం తీవ్రమైన కష్టాల్లో చిక్కుకుంది. ఒకప్పుడు ''అన్నదాత''గా గౌరవించబడిన రైతు, ఇప్పుడు అప్పుల బారిన పడి, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు. వర్షాలపై ఆధారపడే పంట వ్యవస్థ, మార్కెట్‌లో అస్థిర ధరలు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం ఇవన్నీ కలసి వ్యవసాయాన్ని లాభరహిత రంగంగా మార్చేశాయి. పంట పండిరచినా రైతు నష్టపోవడం, పండిరచకపోయినా నష్టపోవడం అనేది ఈ రంగానికి నేటి వాస్తవ చిత్రం. ప్రకృతి మార్పులు కూడా వ్యవసాయ రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. గత కొన్నేళ్లుగా వర్షాల విధానం పూర్తిగా మారిపోయింది. ఎప్పుడు కురిసినా వరదలు, లేకుంటే కరువు అనే రెండు అతి పరిస్థితులు రైతును భయపెడుతున్నాయి. ఒకే పంటకు విత్తనాలు వేసినా వర్షాల కొరతతో పంట విఫలం కావడం, పంటలు మునిగి నష్టపోవడం తరచుగా జరుగుతోంది. ఈ కారణంగా రైతు ప్రతి సీజన్‌కి ముందు ''ఈసారి వర్షం ఎలా ఉంటుంది?'' అని భయపడుతున్నాడు. పంటలకు సరైన నీటి వనరులు లేకపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో పొలాలు పాడైపోతున్నాయి. నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నా, వాటి ప్రయోజనం రైతు వరకూ సరిగా చేరడం లేదు.

ఆర్థిక పరంగా చూస్తే రైతు స్థితి మరింత దయనీయంగా ఉంది. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, కార్మికుల వేతనాలు అన్నీ రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. పంట పండిరచే ఖర్చు భారీగా పెరిగినా, మార్కెట్‌లో ధర మాత్రం పెరగడం లేదు. రైతు చెమటోడ్చి పండిరచిన పంటకు మధ్యవర్తులు, మిల్లర్లు, వ్యాపారులు అధిక లాభాలు సంపాదిస్తుండగా, నిజమైన కష్టజీవి రైతు చేతిలో మాత్రం తగినంత లాభం మిగలడం లేదు. ప్రభుత్వ మద్దతు ధరలు కూడా చాలా పంటలకు వర్తించకపోవడం రైతు నిరాశకు కారణం. పంటల బీమా పథకాలు, రైతు బంధు వంటి పథకాలు ఉన్నా అవి సరిగా అమలు కావడం లేదు. బీమా సంస్థలు పరిహారం చెల్లించడంలో ఆలస్యం చేస్తాయి. కొన్నిసార్లు పరిహారం రాకపోవడంతో రైతులు దెబ్బతింటున్నారు. ఒక పంట విఫలమైతే, దాని నష్టాన్ని తట్టుకునే స్థోమత రైతుకు ఉండదు. ఈ స్థితి అతనిని అప్పుల బారిన పడేలా చేస్తుంది. గ్రామీణ రుణ వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు మళ్లీ ప్రైవేట్ అప్పులపై ఆధారపడుతున్నారు. ఈ దుష్ప్రభావం రైతు కుటుంబం మొత్తానికీ తీవ్ర సమస్యలను తెచ్చిపెడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయంలో ఉపయోగపడే అవకాశం ఉన్నా, గ్రామీణ స్థాయిలో రైతులకు అవగాహన లేకపోవడం పెద్ద అడ్డంకిగా మారింది. డ్రిప్ ఇరిగేషన్, స్మార్ట్ ఫార్మింగ్, డ్రోన్ల ద్వారా పంట పరిశీలన వంటి ఆధునిక పద్ధతులు ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో అందుబాటులో లేవు. ప్రభుత్వ వ్యవసాయ శాఖలు, పరిశోధనా కేంద్రాలు రైతులకు ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇచ్చే విధంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. పంటల ఎంపిక, నేల తత్వం, నీటి వినియోగం వంటి అంశాలలో శాస్త్రీయ మార్గదర్శకాలు అందిస్తే రైతులు మరింత లాభపడగలరు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్ వ్యవస్థ అవసరం. రైతు ఉత్పత్తులను ప్రాసెస్ చేసి ఎగుమతి చేయగల విధంగా ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి. కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, నేరుగా రైతు నుంచి వినియోగదారుడికి చేరే మార్కెట్లు ఏర్పాటైతే రైతుకు నిజమైన లాభం దక్కుతుంది. మధ్యవర్తుల ఆధిపత్యం తగ్గితే రైతు ఆదాయం పెరగగలదు. ఇది సాధ్యమైతేనే వ్యవసాయం తిరిగి స్థిరపడుతుంది. ప్రభుత్వాలు ప్రతి ఎన్నికల్లో రైతు సంక్షేమం పేరుతో హామీలు ఇస్తున్నా, అమలు మాత్రం సగం మాత్రమే జరుగుతోంది. రైతు సమస్యలను తాత్కాలికంగా పరిష్కరించే బదులు దీర్ఘకాలిక దిశగా ప్రణాళికలు అవసరం. నీటి వనరుల సమర్థ వినియోగం, రైతు విద్య, మార్కెట్ సంస్కరణలు, సాంకేతిక సహాయం ఇవన్నీ సమగ్రంగా అమలు అయితేనే రైతు నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

రైతు భవిష్యత్తు భద్రంగా ఉండటం అంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉండటం. రైతు లేకుండా దేశం బతకదు, ఆహార భద్రత కూలిపోతుంది. కాబట్టి వ్యవసాయ రంగాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. రైతు చెమట చుక్కతో పుడుతున్న అన్నం విలువైనదని మనం గుర్తించాలి. రైతు చిరునవ్వు మళ్లీ కనిపించే రోజు రావాలంటే, అతనికి గౌరవం, భరోసా, భద్రత ఇవ్వడం మన సమాజపు తొలి కర్తవ్యం.

# రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ వ్యతిరేకతలు ప్రజాస్వామ్యానికి నష్టం లేదా బలం?



రాష్ట్ర రాజకీయ వాతావరణం ఇటీవలి నెలలుగా వేడెక్కుతోంది. ప్రతి విధానంపై, ప్రతి నిర్ణయంపై ప్రజలు, ప్రతిపక్షాలు, సామాజిక వర్గాలు తీవ్ర స్పందన వ్యక్తం చేస్తున్నాయి. ఇది ఒకపక్క ప్రజాస్వామ్య చైతన్యానికి సూచనగా కనిపిస్తే, మరోపక్క ఈ వాదోపవాదాలు హద్దులు దాటితే పాలనలో అస్థిరత, ప్రజల్లో విభజన, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం కూడా ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యతిరేకతలు సహజం కానీ, అవి ఆరోగ్యకరంగా కొనసాగడమే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదు సంవత్సరాలకు ఒకసారి ఓటు వేయడం కాదుబీ అది ప్రతి రోజూ ప్రజలు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయగలగడం. ప్రజలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం, ప్రశ్నించడం, బాధ్యతను కోరడం ు ఇవే ప్రజాస్వామ్య ప్రాణం. ఈ దిశలో చూస్తే, రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ వ్యతిరేకతలను ప్రజల చైతన్యానికి సంకేతంగా పరిగణించవచ్చు. కాని, ఆ వ్యతిరేకతలు వ్యక్తిగత ద్వేషానికి, రాజకీయ లాభ నష్టాల క్రీడలకు వేదికగా మారితే మాత్రం వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది.

ఇటీవలి కాలంలో పలు ప్రభుత్వ నిర్ణయాలు సంక్షేమ పథకాలు, భూసంస్కరణలు, నియామక విధానాలు, ప్రాజెక్టుల కేటాయింపులు అన్నీ ప్రజా చర్చకు దారితీశాయి. ప్రతిపక్ష పార్టీలు వీటిని రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తుండగా, ప్రభుత్వం కూడా తమ వైపు ఉన్న సానుకూల అంశాలను ప్రచారం చేస్తోంది. ఈ పరిస్థితి సాధారణంగా కనిపించినప్పటికీ, దాని వెనుక ఒక పెద్ద ప్రశ్న ఉంది: ఈ విభేదాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నాయా? లేక విభజనాత్మక వాతావరణాన్ని పెంచుతున్నాయా? పాలనలో పారదర్శకత కోసం వ్యతిరేకతలు అవసరం. ప్రతిపక్షం ఉన్నత ప్రమాణాలతో ప్రశ్నించాలి, ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. ఇదే ప్రజాస్వామ్య ధర్మం. ఉదాహరణకు, ఒక పథకం అమలులో లోపాలుంటే దానిని బయటపెట్టడం ప్రజలకు మేలు చేస్తుంది. కానీ, అదే విషయాన్ని రాజకీయ లాభం కోసం వక్రీకరించడం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుంది. ఈ తేడాను అర్థం చేసుకునే పరిపక్వతే ప్రజాస్వామ్యానికి బలం.

ఇంకా ఒక ప్రధాన అంశం ప్రజల పాత్ర. ప్రజలు ఏ విధమైన సమాచారం వింటే వెంటనే నమ్మకూడదు. ప్రతి రాజకీయ ప్రకటన వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని తెలుసుకోవాలి. సోషల్ మీడియా యుగంలో ప్రతి వ్యాఖ్య, ప్రతి వీడియో ఒక అభిప్రాయం కాకుండా, ఒక అజెండాగా మారిపోతోంది. ఈ సందర్భంలో ప్రజలు వివేకంతో, వివేచనతో స్పందిస్తేనే రాజకీయ వాతావరణం సంతులితంగా ఉంటుంది. ప్రతిపక్షాల దృష్టికోణం కూడా మారాలి. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం కాదుబీ ప్రజలకు ప్రత్యామ్నాయ విధానాలను చూపడం, నిర్మాణాత్మక విమర్శలు చేయడం అవసరం. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం బలహీనమైతే ప్రభుత్వం కూడా నిర్లక్ష్యానికి లోనవుతుంది. అందుకే సజీవమైన ప్రతిపక్షం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి గుర్తు.

అదేవిధంగా, ప్రభుత్వం కూడా వ్యతిరేక స్వరాలను అణగదీయడం కన్నా వాటిని విన్నపంగా స్వీకరించాలి. ప్రజలలో ఉన్న అసంతృప్తిని అర్థం చేసుకోవడం, సమస్యలకు స్పందించడం పాలనలో బాధ్యత. పాలక వర్గం విమర్శలను శత్రుత్వంగా చూడకుండా, వాటిని ప్రజా అభిప్రాయం ప్రతిబింబంగా గుర్తిస్తే పాలన స్థిరంగా ఉంటుంది.

ఇక చివరగా, ప్రజాస్వామ్యం బలంగా నిలవాలంటే చర్చా సంస్కృతి, సహనశక్తి, పరస్పర గౌరవం పెరగాలి. రాజకీయ విభేదాలు తప్పనిసరిగా ఉంటాయి, కాని అవి అభివృద్ధికి అడ్డుకాదని గుర్తించాలి. ప్రజల ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా ఉన్నంతవరకు వ్యతిరేకతలన్నీ ప్రజాస్వామ్యానికి బలం అవుతాయి. అదే మన వ్యవస్థను బలపరచే మార్గం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి సమాజం ఎటు పోతోంది?



ఇప్పటి యువత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో పెరిగి, అవకాశాలతో నిండిన కాలంలో జీవిస్తోంది. కానీ అదే సమయంలో ఈ తరం ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి మాత్రం భయానక స్థాయికి చేరుకుంది. ఉద్యోగ పోటీలు, సోషల్ మీడియా ఒత్తిడి, సంబంధాల సంక్లిష్టత, కుటుంబ అంచనాలు ఇవన్నీ కలిసి యువత మనసులపై భారంగా మారుతున్నాయి. వెలుపల చూస్తే చక్కని జీవితం అనిపించినా, అంతరంగంలో ఎన్నో ప్రశ్నలు, భయాలు, నిరాశలు దాగి ఉన్నాయి. సోషల్ మీడియా ఈ ఒత్తిడిలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని 'హైలైట్ మోమెంట్స్' మాత్రమే చూపించే వేదికగా మారిన ఈ మీడియా వాస్తవాన్ని వక్రీకరిస్తోంది. ఇతరులు సక్సెస్ అవుతున్నారు, తాము వెనుకబడ్డామని భావించే భావజాలం యువతలో అసహనాన్ని పెంచుతోంది. ప్రతి లైక్, ప్రతి కామెంట్, ప్రతి ఫాలో సంఖ్యే ఇప్పుడు ఆత్మవిశ్వాసానికి కొలమానం అవుతోంది. ఇలా వాస్తవం కన్నా వర్చువల్ ప్రపంచంలో ఎక్కువగా మునిగిపోయే పరిస్థితి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగ పోటీలు కూడా ఈ ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. ఒక సీటుకి వందల మంది పోటీ పడే పరిస్థితి యువతలో ఆందోళనను, ఆత్మన్యూనతను పెంచుతోంది.

''మనం సరిపోమేమో'', ''మనకెందుకూ అవకాశం రాదేమో'' అనే ఆలోచనలు మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఉన్నత విద్యావంతులైన యువకులు కూడా నిరుద్యోగం వలన డిప్రెషన్‌లోకి జారిపోతున్నారు. ఒకసారి ఆ దిశలో అడుగుపెడితే తిరిగి సాధారణ స్థితికి రావడం కష్టమవుతోంది. సంబంధాల సమస్యలు కూడా మరో ముఖ్య కారణం. ప్రేమ, వివాహం, కుటుంబ బంధాలు ఇవి అన్నీ ఇప్పుడు ఒత్తిడికి కారణమవుతున్నాయి. సోషల్ మీడియా స్నేహాలు తాత్కాలికంగా, సంబంధాలు సున్నితంగా మారాయి. నమ్మకం తగ్గిపోవడం, భావోద్వేగ అనుబంధం లేమి యువతలో ఒంటరితనాన్ని పెంచుతోంది. తల్లిదండ్రుల అంచనాలు కూడా ఈ ఒత్తిడిలో భాగమే. పిల్లలపై విజయానికి పీడన పెంచడం, మార్కులు లేదా ఉద్యోగమే జీవితమని భావించడం వంటి ధోరణులు యువత మనసుల్లో దడ సృష్టిస్తున్నాయి. అధునాతన జీవనశైలీ కూడా మానసిక ఆరోగ్యానికి ప్రతికూలంగా మారింది. తగిన నిద్ర లేకపోవడం, అహారపు అలవాట్లలో మార్పు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అంశాలు డిప్రెషన్ తీవ్రతను పెంచుతున్నాయి. ఇవన్నీ క్రమంగా శారీరక, మానసిక వ్యాధులకు దారితీస్తున్నాయి. మనసు బలహీనమైతే శరీరం కూడా బలహీనమవుతుంది అన్న సత్యం మరచిపోతున్నారు. ఇప్పటి యువతకు కావలసింది అవగాహన, అర్థం చేసుకునే సహచరులు, మాట్లాడే వేదిక. మానసిక ఆరోగ్యం గురించి ఇంకా చాలా మంది మాట్లాడటానికి సిగ్గుపడుతున్నారు. కానీ డిప్రెషన్ కూడా ఒక వ్యాధే అది శరీరానికి కాకుండా మనసుకి వస్తుంది అంతే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అందరూ యువతతో ఓపెన్‌గా మాట్లాడాలి. విన్నపాలు విని, ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రభుత్వం, విద్యాసంస్థలు కూడా దీనిపై దృష్టి పెట్టాలి. ప్రతి కాలేజీలో, విశ్వవిద్యాలయంలో కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇది ఇప్పుడు ఒక లగ్జరీ కాదు, అవసరం. యువతే దేశ భవిష్యత్తు, వారి మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం ముందుకు సాగుతుంది. చివరగా, ప్రతి యువకుడు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే జీవితం ఒక్క పరీక్షతో, ఒక్క ఫలితంతో నిర్ణయించబడదు. విజయం తాత్కాలికం, విఫలం శాశ్వతం కాదు. మనసును గెలుచుకోవడం నేర్చుకుంటే, ప్రపంచం మనదే అవుతుంది. మానసిక ఆరోగ్యం అంటే బలహీనత కాదు, అది ధైర్యానికి, పరిపక్వతకు సూచిక. సమాజం ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడే యువత నవ్వులు నిజమైన ఆనందంగా మారుతాయి.



# భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తేనే నిజమైన ధర్మం

- సనాతన ధర్మం పేరుతో దౌర్జన్యం చేస్తే ఊరుకోం
- ఆత్మగౌరవ అస్తిత్వ పోరాటాల యోధుడు,పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**సూర్యాపేట,అక్టోబర్29(తెలంగాణ ముచ్చట్లు):** సూర్యాపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాజన లాయర్ల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డప్పుకు మల్లయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆత్మగౌరవ అస్తిత్వ పోరాటాల యోధుడు, సంఘసంస్కర్త, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భారత రాజ్యాంగమే అత్యున్నతమైన ధర్మం. దాన్ని గౌరవించడమే అసలైన సనాతనం. సనాతన ధర్మం పేరుతో దౌర్జన్యం చేసే వారిని సహించం" అన్నారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ చేసిన బూటు విసిరిన ఘటనను మందకృష్ణ తీవ్రంగా ఖండించారు. "ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఇది భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ముఖ్యంగా దళిత సమాజం మీద దాడి" అని పేర్కొన్నారు.

బూటు విసిరిన వ్యక్తితో పాటు, అతని వెనుక ఉన్న దుష్టశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక న్యాయమూర్తులు సున్నితమైన తీర్పులు ఇచ్చినా, అలాంటి దాడులు జరగలేదని, కానీ అక్టోబర్ 7న గవాయ్‌పై జరిగిన దాడి దేశవ్యాప్తంగా ఆగ్రహం రేకెత్తించిందని అన్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1న హైదరాబాద్‌లో లక్షలాది దళితులతో 'ఆత్మగౌరవ మహాప్రదర్శన' నిర్వహిస్తున్నామని, ప్రజాస్వామ్యవాదులు అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకర బోయినరాజు, దావుల వీరప్రసాద్ యాదవ్, వసంత సత్యనారాయణ పిల్లే, సుదర్శన్ రెడ్డి, షఫీ ఉల్లా, ఫరుద్దీన్, మీసాల శ్రీనివాస్, మందుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎంఆర్పీఎస్‌ఎంఎస్పీ నాయకులు బచ్చల కూర వెంకటేశ్వర్లు మాదిగ, చింతలపాటి చిన్న శ్రీరాములు, యాతాకుల రాజన్న, చింత వినయ్ బాబు, ఏపూరి రాజు, ఎర్ర వీరస్వామి, యలమర్తి రాము, కొండపల్లి ఆంజనేయులు, మేడి కృష్ణ, పండింటి నవీన్ కుమార్, దైద శీను, దాసరి వెంకన్న, బొజ్జ వెంకన్న, చెరుకుపల్లి సతీష్ కిరణ్, మొండికత్తి గోపీచంద్, మనోజ్ కుమార్, మిరియాల చిన్ని తదితరులు పాల్గొన్నారు.




# సోషల్ మీడియా ప్రభావం.. సమాచార యుగం సత్యం మరియు అపోహాలు




సాంకేతిక విప్లవం మన జీవితంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. వాటిలో అత్యంత ముఖ్యమైనది సోషల్ మీడియా. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్), వాట్సాప్ వంటి వేదికలు నేటి మనిషి రోజువారీ జీవితంలో భాగమైపోయాయి. సమాచారాన్ని పంచుకోవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం ఇవన్నీ ఇప్పుడు కేవలం ఒక టచ్ దూరంలో ఉన్నాయి. కానీ ఈ సౌలభ్యం వెనుక ఉన్న ప్రమాదాలను మనం గమనించకపోతే, సోషల్ మీడియా ఆశీర్వాదం కాకుండా శాపంగా మారే ప్రమాదం ఉంది. సోషల్ మీడియా మనకు సమాచారాన్ని తక్షణం అందించే సాధనంగా మారింది. ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతుందో క్షణాల్లో తెలుసుకునే అవకాశం కల్పించింది. రాజకీయాల నుంచి వినోదం వరకు, క్రీడల నుంచి వ్యాపారం వరకు అన్ని రంగాల సమాచారమూ ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా చేరుతోంది. ఈ స్వేచ్ఛ మనకు తెలియని విషయాలను నేర్పుతున్నప్పటికీ, అదే సమయంలో అబద్ధాలూ, తప్పుడు వార్తలూ కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. సత్యం మరియు అపోహల మధ్య తేడా గుర్తించలేని పరిస్థితి ఏర్పడిరది. ఇది ప్రజాస్వామ్యానికి, సామాజిక సమన్వయానికి ప్రమాదకర సంకేతం. తప్పుడు సమాచారం లేదా ఫేక్ న్యూస్ సోషల్ మీడియాలో ప్రధాన సమస్యగా మారింది. రాజకీయ ప్రయోజనాలు, వర్గపోరాటాలు, మత విభజనలు ఇవన్నీ ఫేక్ పోస్టులు, దారి తప్పించే వీడియోలు, ఎడిట్ చేసిన ఫోటోల ద్వారా మరింత ప్రబలుతున్నాయి. ప్రజలు ఆ సమాచారాన్ని పరిశీలించకుండా నమ్మి షేర్ చేయడం వల్ల అపోహాలు మరింత వేగంగా వ్యాపిస్తున్నాయి. దీని ప్రభావం ఎన్నికల ఫలితాలపై, సామాజిక వాతావరణంపై, వ్యక్తిగత సంబంధాలపై కూడా కనిపిస్తోంది. ఒక క్లిక్‌తో ప్రపంచం మారే ఈ కాలంలో బాధ్యతతో వ్యవహరించడం మనందరి కర్తవ్యం.

మరోవైపు, సోషల్ మీడియా వ్యక్తిగత జీవితంపై చూపుతున్న ప్రభావం కూడా గమనించదగ్గది. మనిషి నేటి రోజుల్లో నిజ జీవితానికి దూరమై వర్చువల్ ప్రపంచంలో ఎక్కువ సమయం గడుపుతున్నాడు. లైకులు, ఫాలోవర్లు, కామెంట్లు మన భావోద్వేగాల మాపకం అయ్యాయి. ఇవి మనసులో అసహనం, పోలికలు, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా యువత ఈ మాయాజాలంలో ఇరుక్కుపోతున్నారు. వాస్తవ జీవితంలో కష్టపడటం కంటే, వర్చువల్ గుర్తింపు కోసం ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. ఇది సమాజంలో ఒక కొత్త ఒత్తిడిని సృష్టిస్తోంది. అయితే సోషల్ మీడియాకు సానుకూల వైపులూ ఉన్నాయి. ఇది సాధారణ ప్రజల గొంతుకగా మారింది. అన్యాయంపై మాట్లాడటానికి, అవినీతి బయట పెట్టడానికి, సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరించడానికి ఇది గొప్ప వేదిక. ప్రకృతి విపత్తులు, రక్తదానం, సహాయ చర్యలు వంటి సందర్భాల్లో సోషల్ మీడియా ద్వారా సహాయం క్షణాల్లో చేరుతుంది. చిన్న వ్యాపారాలు కూడా తమ ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేయగలుగుతున్నాయి. కాబట్టి, దీనిని ఎలా వాడాలో తెలుసుకోవడమే అసలు కీ.

సోషల్ మీడియా వినియోగంలో ప్రధానంగా బాధ్యత మరియు అవగాహన అవసరం. ఏ వార్త అయినా నమ్మకముందు దాని మూలాన్ని పరిశీలించడం అలవాటు కావాలి. వాస్తవం, అబద్ధం మధ్య తేడా తెలుసుకునే సామాజిక విద్య పాఠశాల స్థాయి నుంచే ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానం అందించే స్వేచ్ఛ మన మంచికే, కానీ దాన్ని వాడే విధానం మన చేతుల్లోనే ఉంది. అవగాహనతో వాడితే సోషల్ మీడియా శక్తి అవుతుందిబీ అవివేకంగా వాడితే అది మానవ సంబంధాలను ధ్వంసం చేసే శక్తిగా మారుతుంది. ప్రభుత్వాలు కూడా సోషల్ మీడియా నియంత్రణలో సంతులనం పాటించాలి. స్వేచ్ఛను అణగదీయకుండా, తప్పుడు సమాచారాన్ని అరికట్టే చట్టాలు అవసరం. సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రైవసీ, ఆన్‌లైన్ ఎథిక్స్ వంటి అంశాల్లో కఠిన నిబంధనలు పెట్టి అమలు చేయాలి. అంతేకాక, సోషల్ మీడియా కంపెనీలు కూడా తమ బాధ్యతను గుర్తించి తప్పుడు సమాచారాన్ని వెంటనే తొలగించే విధానం పాటించాలి. సమాచార యుగం మనకు అసంఖ్యాక అవకాశాలు తెచ్చింది. కానీ సత్యం, అపోహ మధ్య ఉన్న సరిహద్దు రోజురోజుకీ మసకబారుతోంది. సోషల్ మీడియా ఒక అద్భుత సాధనమే కానీ, దాన్ని జాగ్రత్తగా వాడటం నేర్చుకోవాలి. ప్రతి యూజర్ తన మాట, తన పోస్ట్ సమాజంపై చూపే ప్రభావాన్ని ఆలోచిస్తేనే ఈ వేదిక మనకు నిజమైన శక్తిగా ఉంటుంది. సాంకేతికత మన చేతిలో ఉన్న సాధనం మాత్రమే దానిని మనం ఎలా వాడతామన్నదే భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్





# షుగర్ ఉన్నవారు.. చెరుకు రసం తాగొచ్చా..

ఒఎండాకాలం వచ్చిందంటే చాలు అందరికీ తిప్పలు మొదలవుతూ ఉంటాయి. ఎందుకంటే ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు ఎంతో మంది ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఇక మండే ఎండలకు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటేనే భయపడిపోతూ ఉంటారు. కానీ ఏం చేస్తాం తప్పని పరిస్థితుల్లో ఉద్యోగమో.. లేదంటే ఇతర పనులను మీద బయటకు వెళ్లాల్సిందే. దీంతో ఎండా కాలంలో బయటికి వెళ్ళినప్పుడు ఉపశమనం కోసం ఏదో ఒకటి తాగడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇలా ఎండాకాలం లో ఎక్కడికి వెళ్తున్నా అందుబాటులో ఉండే పానీయం ఏదైనా ఉంది అంటే అది చెరుకు రసం అని చెప్పాలి. రోడ్డు వెంట వెళ్తుంటే ప్రతిచోట ఇలా చెరుకు రసం బండ్లు కనిపిస్తూ ఉంటాయి. ఈ క్రమం లోనే ఇలా ఎండ వేడిని తట్టుకునేందుకు కాస్త ఉపశమనాన్ని పొందేందుకు ఎంతో మంది చెరుకు రసం తాగడం లాంటివి చేస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. అయితే కొంతమంది మాత్రం చెరుకు రసం తాగడానికి భయపడిపోతూ ఉంటారు. వాళ్లే ఇక మధుమేహంతో బాధపడుతున్న వారు. సాధారణంగా చెరుకు రసంలో తీపి ఎక్కువగా ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే అటు షుగర్ తో బాధ పడుతున్న వారు చెరుకు రసం తాగొచ్చా లేదా అని ఎప్పుడూ అనుమాన పడుతూ ఉంటారు. ఈ అనుమానం తోనే కొన్నిసార్లు తాగకుండా సైలెంట్ గానే ఉండి పోతారు. అయితే మధుమేహం ఉన్నవారు చెరుకు రసం తాగొచ్చా అంటే అసలు వద్దంటున్నారు వైద్య నిపుణులు. ఇవి జ్యూస్ తాగినప్పుడు మధుమేహం లేని వారిలో కూడా షుగర్ లెవెల్స్ స్వల్పంగా పెరిగినట్లు అధ్యయనం లో తేలింది అంటూ చెబుతున్నారు. చెరుకు రసంతో పలు ఉపయోగాలు ఉన్నప్పటికీ డయాబెటిస్తో బాధపడుతున్న వారు మాత్రం దానికి దూరంగా ఉండటమే మంచిది అని సూచిస్తున్నారు.




# మూత్రం పసుపు రంగులో వస్తే..?

మానవ శరీరంలో చాలా ముఖ్యమైన అవయవాలలో కిడ్నీలు కూడా ఒకటీ.ఇది మన శరీరంలోని రక్తం నుండి మురికిని అదనపు ద్రవాలను సైతం ఫిల్టర్ చేయడానికి ఉపయోగపడుతుంది.అలాగే రక్తపోటు ఎర్ర రక్త కణాలను నియంత్రించే హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తుంది. అందుకే మన శరీరంలో చాలా ముఖ్యమైనవిగా చెబుతూ ఉంటారు. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ఆకలి లేకపోవడం, పాదాలు వాయడం, దురద చర్మం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తక్కువ మూత్ర విసర్జన వంటి లక్షణాలు ఉంటాయి అలాగే పసుపు మూత్రం కూడా వచ్చినట్టుగా అనిపిస్తుంది. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలి అంటే మనం డైట్ లో మూత్రపిండాలను శుభ్రపరిచే ఆహారాలను సైతం తీసుకోవలసి ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు కూడా మెరుగుపడుతుంది. దీనివల్ల మన శరీరంలో ఉండే విష పదార్థాలు కూడా బయటకి రావడానికి సహాయపడుతుంది. అలాంటి వాటిలో కూరగాయలు మూత్రపిండాలలోని విషయాన్ని సైతం తొలగించడానికి చాలా ఉపయోగపడుతుంది. ఫైబర్ పుష్కలంగా ఉండేటువంటి వాటిని తినడం వల్ల మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడతాయట. ముఖ్యంగా క్యాబేజీ ,కాలీఫ్లవర్, బ్రోకలీ వంటి వాటిని తినాలి.స్ట్రాబెర్రీ ,బ్లూబెర్రీ ఇతరత్రా బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మూత్రపిండాలు ఆరోగ్యానికి సహాయపడతాయి. అలాగే కిడ్నీ కణజాలానికి హాని కలిగించే ఆక్సీకరన నుంచీ బయటపడేలా చేస్తుంది.ఆకుకూరలలో బచ్చలాకుకూర ,మెంతికూర ఇతరత్రా ఆకుకూరలలో విటమిన్లు ఖనిజాలు చాలా పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. నారింజ ,నిమ్మ ,ద్రాక్ష పండు వంటి వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.ఇది మూత్రపిండంలో రాళ్లు పడకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. సిట్రిక్ పండ్లను తాజా పండ్లుగా తినడమే చాలా మంచిది.

# నిద్ర పట్టకపోతే కంటి ఆరోగ్యం షెడ్డుకే..?

మనం సరిగ్గా నిద్రపోతున్నారో లేదో ముందుగా చెక్ చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కంటి ఆరోగ్యానికి సరైన నిద్ర అవసరం. మనం రోజంతా ఎన్ని పనులు చేసినా, ఎంత బిజీగా ఉన్నా రాత్రిపూట బాగా నిద్రపోవాలి. తగినంత నిద్ర లేనప్పుడు శరీరంలో అనేక రకాల సమస్యలు వస్తాయి. నిద్ర మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. నిద్ర కంటి ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని చాలా మందికి తెలియదు. శరీరంలోని మిగిలిన భాగాల మాదిరిగానే, కళ్ళకు విశ్రాంతి మరియు పునరుజ్జీవనానికి సమయం కావాలి. నిద్రపోతున్నప్పుడు కళ్లు తాజాగా ఉంటాయి. ఇది మంచి దృష్టి మరియు కంటి పనితీరులో సహాయపడుతుంది. ఈ రాత్రి ప్రక్రియలో రోజంతా పేరుకుపోయిన దుమ్ము, అలెర్జీ కారకాలు మరియు చికాకులను బయటకు పంపడానికి కళ్లను లూబ్రికేట్ చేయడం ఉంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కంటి సమస్యలు వస్తాయి. వాటిలో ఒకటి డ్రై ఐ సిండ్రోమ్. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కళ్లు హైడ్రేట్ గా ఉండే అవకాశాలు తగ్గుతాయి. ఇది చికాకు, కళ్ళు ఎర్రబడటం, పొడిబారడం వంటి బాధించే సమస్యలను కలిగిస్తాయి. వీటితో పాటు దృష్టి లోపం కూడా రావచ్చు. నిద్ర లేకపోవడం వల్ల తలెత్తే మరో సమస్య ఫ్లాపీ ఐలిడ్ సిండ్రోమ్. కళ్లకు తగినంత విశ్రాంతి లభించనప్పుడు వచ్చే సమస్య ఫ్లఫీ ఐలిడ్ సిండ్రోమ్. ఈ రుగ్మత నిద్రపోతున్నప్పుడు కనురెప్పలలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. సహజ రక్షణ విధానాలకు భంగం కలిగించడం, చికాకు మరియు కార్నియల్ రాపిడికి దారితీస్తుంది. నిద్ర నాణ్యత, కంటి చూపు మధ్య మరొక ప్రత్యక్ష లింక్ ఏమిటంటే, నిద్ర లేకపోవడం కంటి లెన్స్‌ను కేంద్రీకరించడానికి బాధ్యత వహించే కండరాలను బలహీనపరుస్తుంది. ఇది ట్రాన్సియెంట్ మయోపియా, షార్ట్ టర్మ్ దగ్గరి చూపు వంటి దృష్టి సమస్యలకు దారితీస్తుంది. సుదూర వస్తువులను స్పష్టంగా చూసే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది.





# ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీళ్లు తాగడం మంచిది..

ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం చాలా ముఖ్యం. ఈ ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం.ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ ప్రక్రియ మెరుగుపడుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మురికి సులభంగా తొలగిపోతుంది. ఇది మాత్రమే కాదు, ఇతర వ్యక్తులతో పోలిస్తే ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగే వారిలో కిడ్నీ, రాళ్ల సమస్యలు తక్కువగా కనిపిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, మనం ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నీళ్లు తాగాలి. అయితే ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీళ్లు తాగడం వల్ల ప్రయోజనం ఉంటుందనే ప్రశ్న తరచుగా చాలామంది ప్రజల మదిలో మెదులుతుంది. చాలామంది ఉదయం నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి చెబుతుంటారు. అయితే ఇప్పుడు మనం ప్రతిరోజు ఉదయాన్నే ఎన్ని గ్లాసుల నీళ్లు తాగాలో తెలుసుకుందాం. మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే మొదట చేయవలసిన పని మీ పళ్ళు తోముకోవడం, మీకు టీ తాగే అలవాటు ఉంటే, దానికి బదులుగా నీరు తాగటం అలవాటు చేసుకోండి. ఉదయం నిద్ర లేవగానే కనీసం 23 గ్లాసుల నీళ్లు తాగాలి. మీరు ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగలేకపోతే, ఒక గ్లాసు నీటితో ప్రారంభించండి. క్రమంగా కొన్ని రోజుల్లో 2 3 గ్లాసుల నీళ్లు తాగడం ప్రారంభించండి. మీరు ఉదయాన్నే తాగు నీటిని గోరువెచ్చగా చేయండి. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా రోగనిరోధక శక్తిని కూడా బలపరుస్తుంది. వేడి నీటిని తాగడం వల్ల మీ జీర్ణ వ్యవస్థ చురుగ్గా ఉంటుంది. అయితే నీళ్లు తాగిన తర్వాత కనీసం అరగంట వరకు ఏమి తినకూడదు లేదా తాగకూడదు అని గుర్తుంచుకోండి.

# రోజూ కివి తింటే ఎన్ని ప్రయోజనాలో..



ప్రజలు తమ డైట్ లో కచ్చితంగా పండ్లను చేర్చుకోవాలని వైద్యనిపుణులు చెబుతుంటారు. పండ్లను తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతారు. నిజానికి, పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే పండ్లలో కూడా కొన్ని పండ్లను పోషకాల నిధిగా చెబుతారు. ఈ పండ్లలో ఒకటి కివి. ఇది రుచిలో తియ్యగా, పుల్లగా ఉంటుంది. అందుకే చాలామంది దీన్ని ఎక్కువగా ఇష్టపడతారు. అయితే తియ్యగా, పుల్లగా ఉంటే ఈ కివీ అనేక తీవ్రమైన వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే ఈ రోజూ కివి పండును ఎంత మోతాదులో తినాలి, దాని ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. కివితో కలిగే ప్రయోజనాలు.. కివిలో పొటాషియం, ఫైబర్, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఇ, పాలీఫెనాల్స్ పుష్కలంగా లభిస్తాయి. అలాగే కివిలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఈ పండు అమృతం లాంటిది. అంతే కాదు అనేక వ్యాధులను నివారించడంలో ఈ పండు సంజీవనిలా పనిచేస్తుంది.

1. కంటి చూపు.. కంటి చూపును మెరుగుపరచడానికి కివి ఎంతగానో ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు. రోజువారి డైట్ లో కివీని చేర్చుకుంటే చూపు మందగించే సమస్య నుంచి బయటపడతారు. 2. రోగనిరోధక శక్తి.. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు రోజుకు ఒక కివీని తినాలంటున్నారు నిపుణులు. కివిలో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. 3. మలబద్ధకం నుండి ఉపశమనం.. మలబద్ధకం, అజీర్ణం, కడుపు నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నట్లయితే ప్రతి రోజు కివీని తినడం మర్చిపోవద్దు. రోజుకు 23 కివీస్ తింటే మలబద్ధకం సమస్య నుండి బయటపడవచ్చని చెబుతున్నారు నిపుణులు. 4. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.. కివీని రోజూ తీసుకోవడం వల్ల మీ గుండె చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో ఉండే పీచు, పొటాషియం చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించి ధమనులను బలోపేతం చేస్తాయి.

# మడమల పగుళ్లకు కొబ్బరి నూనె..



పాదాలను శరీరానికి పునాదిగా పరిగణిస్తారు. మొత్తం శరీరం బరువు పాదాలపైనే ఉంటుంది. మన శరీరాన్ని కదిలించేది పాదాలు. అందుకే పాదాల సంరక్షణ చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో మడమల పగుళ్ల సమస్య సాధారణం. మహిళలు ఎక్కువగా ఈ సమ్యతో బాధపడతారు. తేమ లేకపోవడం, విటమిన్ లోపం, మధుమేహం, థైరాయిడ్, ఊబకాయం, 60 ఏళ్లు పైబడిన వారు మడమల పగుళ్ల సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. మీరు కూడా పగిలిన మడమల సమస్యతో పోరాడుతూ ఉంటే, అది జన్యుపరమైన లేదా ఆరోగ్య కారణాల వల్ల కావచ్చు. దీనికి కారణం, నివారణ మార్గాలను ఇక్కడ తెలుసుకుందాం.. పాదాల పట్ల అజాగ్రత్తగా ఉండటం వల్ల సాధారణంగా మడమల పగుళ్ల సమస్య పెరుగుతుంది. చెప్పులు లేదా ఓపెన్ షూలను ఉపయోగించడం వల్ల కూడా మడమల పగుళ్లు ఏర్పడతాయి. చాలా సార్లు పాదాల మడమలలో లోతైన పగుళ్ల కారణంగా భరించలేని నొప్పిని ఎదుర్కోవలసి ఉంటుంది. మీ పాదాల చర్మం తరచుగా పొడిగా మారుతుంది. పొడిబారినప్పుడు, అది మడమల పగుళ్లకు కారణం అవుతుంది. శరీరంలో తేమ లేకపోవడం వల్ల, సజీవ కణాలు గట్టిపడతాయి. మడమల ప్రాంతంలో చనిపోయిన కణాలు పెరుగుతాయి. మీ చర్మానికి యవ్వనాన్ని, తాజాదనాన్ని తీసుకురావడానికి, వారానికి ఒకసారి మీ పాదాలకు ఇంట్లోనే పెడిక్యూర్ చేసుకోండి. గోరువెచ్చని నీటిలో పాదాలను ముంచడం వల్ల మడమల చర్మం మృదువుగా మారుతుంది. మృతకణాలను తొలగించడంలో సహాయపడుతుంది. ప్రతి రోజూ మీ పాదాలు, మడమల సరైన సంరక్షణ కోసం ప్రతిరోజూ స్నానానికి ముందు మీ పాదాలను స్వచ్ఛమైన బాదం నూనెతో మసాజ్ చేయండి. స్నానం చేసిన తర్వాత, పాదాలు తడిగా ఉన్నప్పుడే క్రీమ్ అప్లై చేయండి. ఇది పాదాలపై తేమను నిలుపుదల చేస్తుంది. ఫుట్ క్రీమ్‌తో మీ పాదాలను సర్క్యులర్ మోషన్‌లో తేలికగా మసాజ్ చేయండి. ఇది మీ పాదాలను మృదువుగా ఉంచుతుంది. మడమల పగుళ్ల సమస్యను నివారిస్తుంది. పాదాల సమస్యలకు తేనె సహజ నివారణగా పనిచేస్తుంది. తేనెలో యాంటీ బాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి పగిలిన మడమలను శుభ్రం చేస్తాయి. పగిలిన మడమలకు సహజంగా చికిత్స చేస్తాయి. పగిలిన మడమల కోసం సహజ చికిత్స మీ వంటగదిలో కూడా అందుబాటులో ఉంది. నిమ్మకాయను కోసి అందులో సగం తీసుకుని అందులో పంచదార కలిపి మడమల మీద మెత్తగా రుద్ది తర్వాత శుభ్రమైన మంచినీటితో మడమలను కడగాలి. వారానికి రెండుసార్లు ఈ ప్రక్రియను అనుసరించడం వల్ల మంచి సానుకూల ఫలితాలు వస్తాయి. మడమల పగుళ్లకు కొబ్బరి నూనె దివ్యౌషధంలా పనిచేస్తుంది.



# భారత్‌లో స్వేచ్ఛగా జీవిస్తున్నా.. బంగ్లా మాజీ ప్రధాని హసీనా

బంగ్లాదేశ్‌లో 2026లో జరిగే జాతీయ ఎన్నికల్లో తమ అవామీ లీగ్ పార్టీని కనుక పోటీ చేయడానికి అనుమతించకపోతే తమ పార్టీ మద్దతుదారులందరూ ఎన్నికలను బహిష్కరిస్తారని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా స్పష్టంచేశారు. గత ఏడాది అంతర్యుద్ధం కారణంగా ఏర్పడిన తిరుగుబాటుతో పదవీచ్యుతురాలై భారత్ వచ్చి ఆశ్రయం పొందుతున్న హసీనా వివిధ అంశాలపై బుధవారం తన అభిప్రాయాలను పంచుకున్నారు.

భారత రాజధానిలో తాను స్వేచ్ఛగా జీవిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో బంగ్లాదేశ్ రాజకీయాల్లో అధికారం చేపట్టడానికి అయినా, ప్రతిపక్ష పాత్ర పోషించడానికి అయినా తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.



# ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి.. భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం : ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంచి మిత్రులన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీపై ట్రంప్ తాజాగా ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ ఓ మంచి వ్యక్తి అని.. ఆయనలాంటి తండ్రి ఉండాలని అందరూ కోరుకుంటారని వ్యాఖ్యానించారు. టోక్యోలో మంగళవారం వ్యాపారవేత్తలతో జరిగిన డిన్నర్ పార్టీలో ట్రంప్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ప్రధాని మోదీ పట్ల నాకు ప్రేమ, గౌరవం ఉన్నాయి. మా మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఆయన లాంటి తండ్రి ఉండాలని చాలామంది కోరుకుంటారు. అయితే ఆయన కఠినమైన వ్యక్తి. బలమైన నేత' అంటూ ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్ ప్రస్తావించారు. భారత్‌తో అతి త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరగనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అంతేకాదు, పాకిస్థాన్‌భారత్ మధ్య మొదలైన యుద్ధానికి వాణిజ్యంతో బ్రేక్ వేసినట్లు ట్రంప్ తెలిపారు.



# గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంలో హమాస్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. బుధవారం గాజాపై వైమానిక దాడులకు దిగింది. దీంతో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, మృతుల్లో 35 మంది చిన్నారులు ఉన్నారని గాజా అధికారిక వర్గాలు తెలిపాయి. గాజా సివిల్ డిఫెన్స్ అధికార ప్రతినిధి మహమూద్ బస్సాల్ మాట్లాడుతూ, 'కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రస్థాయిలో ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. వైమానిక దాడుల కారణంగా గాజాలో అత్యంత దయనీయ, భయానక పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం 12 గంటల్లో 101 మంది ప్రాణాల్ని ఇజ్రాయెల్ బలితీసుకుంది' అని అన్నారు. దీనిపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి స్పందిస్తూ, 'ఇజ్రాయెల్ సైనికులపై హమాస్ దాడి చేసింది. దాంతో శక్తివంతమైన దాడులతో సమాధానమిచ్చాం' అని అన్నారు.

# మహోన్నతమైన రాజ్యాంగం, విశ్వసనీయత మన బలం




అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు, వాణిజ్యంలో అంతరాయాలు, సరకు రవాణా గొలుసుల్లో విపరీత మార్పుల వంటి ప్రతికూల పరిణామాల నేపథ్యంలో ప్రపంచానికి భారత్ ఒక స్థిరమైన దారిదీపంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, శాంతి, సమగ్రాభివృద్ధికి భారత్ ఒక ప్రతీకగా మారిందని హర్షం వ్యక్తంచేశారు.

బుధవారం ముంబైలో ఇండియా మారిటైమ్ వీక్-2025 సందర్భంగా మారిటైమ్ లీడర్స్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. మహోన్నతమైన రాజ్యాంగం, విశ్వసనీయత అనేవి మన దేశాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని స్పష్టంచేశారు. నేటి అంతర్జాతీయ ఒడిదొడుకుల పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఒక దారిదీపం కోసం ఎదురు చూస్తున్నాయని, తెలిపారు. గొప్ప బలంతో మన దేశం ఆ దారిదీపం పాత్రను పోషిస్తోందని వివరించారు.

భారత సముద్రయాన రంగం అత్యధిక వేగం, శక్తితో ముందుకు దూసుకెళ్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో మన ఓడరేవులు గొప్ప సామర్థ్యం కలిగినవిగా గుర్తింపు పొందాయని వెల్లడించారు. మన సముద్రయానం, వాణిజ్య కార్యక్రమాలు విస్తృతమైన దార్శనికతలో భాగమని చెప్పారు. భవిష్యత్తులో నూతన వాణిజ్య మార్గాలకు ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ ఒక ఉదాహరణ అని స్పష్టంచేశారు.

బ్రిటిష్ కాలం నాటి నౌకాయాన చట్టాలను రద్దు చేశామని, 21వ శతాబ్దానికి అవసరమైన నూతన చట్టాలను ప్రవేశపెట్టామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీంతో స్టేట్ మారిటైమ్ బోర్డులు మరింత బలోపేతం అయ్యాయని, పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో డిజిటల్ టెక్నాలజీకి ప్రాధాన్యం లభిస్తోందని తెలియజేశారు. మారిటైమ్ ఇండియా విజన్‌లో భాగంగా 150 ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. దీని వల్ల సముద్రయాన రంగంలో గణనీయమైన పురోగతి సాధ్యమవుతోందని వెల్లడించారు. మనదేశంలోని ప్రధానమైన ఓడరేవుల సామర్థ్యం రెండు రెట్లు పెరిగిందన్నారు.

క్రూయిజ్ టూరిజం గొప్పగా వృద్ధి చెందుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఓడల్లో సరుకు రవాణా 700 శాతానికిపైగా పెరిగిందన్నారు. ప్రధానమైన జల రవాణా మార్గాల సంఖ్య 32కు చేరిందన్నారు. భారతదేశ అభివృద్ధికి మారిటైమ్ రంగం ప్రధాన చోదక శక్తిగా మారిందని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. 21వ శతాబ్దంలో త్రైమాసికం ముగిసిందని, రాబోయే 25 ఏళ్లు అత్యంత కీలకమని సూచించారు. సముద్ర వనరుల ఆధారిత ఆర్థిక వ్యవస్థ, సుస్థిర తీర ప్రాంత అభివృద్ధిపై మరింతగా దృష్టి కేంద్రీకరించాలని స్పష్టంచేశారు.

# క్రిమినల్ కేసుల విచారణలో జాప్యం పై సుప్రీంకోర్టు ఆగ్రహం



నేరమయ కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలుచేశాక సైతం ట్రయల్ కోర్టులు అభియోగాల నమోదుపై తుదినిర్ణయం తీసుకోకపోవడం, దీంతో కేసుల విచారణలో జాప్యంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. దీంతో క్రిమినల్ కేసుల కొండ పేరుకుపోయి న్యాయస్థానాలపై పనిభారం, ఒత్తిడి అత్యంత తీవ్రంగా ఉంటోందని, చివరకు కొన్ని కేసుల విచారణ దశాబ్దాల తరబడి కొనసాగుతోందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

ఈ నేప థ్యంలో దేశవ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో అమలయ్యేలా ఏకరూప నిబంధనావళిని రూ పొందిస్తామని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారి యాల ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ విషయంలో తమకు సహాయకులుగా ఉండాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలను కోర్టు కోరింది. "మేం అంతా గమనిస్తున్నాం. సమ యం గడుస్తోందిగానీ ట్రయల్ కోర్టుల్లో పద్ధతి మారట్లేదు. నిందితులపై పోలీసులు, దర్యాప్తు సంస్థలు నేరాభియోగాలు మోపుతు న్నారు. సంబంధిత ఛార్జ్‌షీట్‌లను ట్రయల్ కోర్టులకు సమర్పిస్తున్నారు. కానీ ట్రయల్ కోర్టులు మాత్రం మూడు, నాలుగేళ్లు గడుస్తున్నా చార్జ్‌షీట్‌లపై తమ నిర్ణయాన్ని ఖరారుచేయట్లేవు. దీంతో విచా రణ మరింత ఆలస్యమవుతోంది. నేరం నమోదుకాకపోతే అసలా కేసులో వాదోపవాదనలు మొదలుకావు. ఇకనైనా కింది కోర్టుల వైఖరి మారేలా దేశవ్యాప్త గైడ్‌లైన్స్ ఇవ్వాల్సిందే" అని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఈ అంశంలో కోర్టు సహాయకులు(అమికస్ క్యూరీ)గా సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాను ధర్మాసనం నియమించింది. బిహార్‌లో క్రిమినల్ కేసుకు సంబంధించి ఒక వ్యక్తిపై చార్జ్‌షీట్ దాఖలై రెండేళ్లు గడుస్తున్నా కిందికోర్టు ఆ నేరాభియోగాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నాన్చుడి ధోరణి అవలంభిస్తోందని, తన క్లయింట్‌కు న్యాయం చేయాలంటూ ఒక న్యాయవాది చేసిన అభ్యర్థన సందర్భంగా సుప్రీంకోర్టు పైవిధంగా స్పందించింది.

ఈ కేసును రెండు వారాల తర్వాత విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. "మహారాష్ట్రలోనూ ఇదే పరిస్థితి ఉంది. 600కుపైగా కేసులో ఇంకా విచారణ కోర్టులు దాఖలైన ఛార్జ్‌షీట్‌లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అని మరో న్యాయవాది వాదించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టం ప్రకారం సెషన్స్ కోర్టులో ఏదైనా కేసు విచారణకు వస్తే చార్జ్‌షీట్ దాఖలైన 60 రోజుల్లోపు ఆ నేరాభియోగాలపై సెషన్స్ కోర్టు తుది నిర్ణయం తీసుకోవాల్సిందే.

" నేరాన్ని వెంటనే నమోదుచేయని కారణంగా ట్రయల్ కోర్టుల్లో క్రిమినల్ కేసుల విచారణ ఆలస్య మవుతోంది. సివిల్ కేసుల్లో ట్రయల్ కోర్టులు ఆయా అంశాలను సరిగా ప్రస్తావించని కారణంగా ఆలస్యమవుతోంది"అని జస్టిస్ కుమార్ అన్నారు. మాజీ హైకోర్టు న్యాయమూర్తి, సీనియర్ న్యాయవాది ఎస్.నాగముత్తు ఈ అంశంలో కోర్టుకు సహాయకులుగా ఉండాలని సుప్రీంకోర్టు కోరింది.

# యుద్ధ విమానంలో రాష్ట్రపతి

భారత రాష్ట్రపతి, త్రివిధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలు ద్రౌపదీ ముర్ము అరుదైన రికార్డు సృష్టించారు. భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన రెండు వేర్వేరు రకాల యుద్ధ విమానాల్లో ప్రయాణించిన మొట్టమొదటి రాష్ట్రపతిగా చరిత్రకెక్కారు. బుధవారం ఉదయం హరియాణాలోని అంబాలా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ద్రౌపదీ ముర్ము అత్యంత శక్తివంతమైన రఫేల్ యుద్ధవిమానంలో ప్రయాణించారు. 2023లో ఆమె సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానంలో ప్రయాణించిన విషయం తెలిసిందే.

అంబాలా ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన రాష్ట్రపతి రఫేల్ పర్యటన 30 నిమిషాలపాటు కొనసాగింది. ఆమె పైలట్ సూట్, కళ్లద్దాలు ధరించారు. రాష్ట్రపతి ప్రయాణించిన యుద్ధ విమానం సముద్ర మట్టానికి సుమారు 15 వేల అడుగుల ఎత్తులో, గంటకు 700 కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లింది. రాష్ట్రపతి రఫేల్ ఫైటర్ జెట్‌లో దాదాపు 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, తిరిగి అంబాలా ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు. ఈ విమానానికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 17వ స్క్వాడ్రన్ 'గోల్డెన్ ఆరోస్' కమాండింగ్ ఆఫీసర్, గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ పైలట్‌గా వ్యవహరించారు. 2020 జూలైలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన రఫేల్ విమానాల మొదటి బ్యాచ్‌ను ఈ 'గోల్డెన్ ఆరోస్' స్క్వాడ్రనే స్వీకరించింది. 'ఆపరేషన్ సిందూర్'లో ఈ స్క్వాడ్రన్ కీలక పాత్ర పోషించింది.

ఈ చారిత్రక పర్యటన అనంతరం రాష్ట్రపతి ముర్ము సందర్శకుల పుస్తకంలో తన అనుభూతిని పంచుకున్నారు. 'రఫేల్ యుద్ధ విమానంలో నా తొలి ప్రయాణం కోసం అంబాలా ఎయిర్‌బేస్‌ను సందర్శించడం ఆనందంగా ఉంది. ఇది నాకు మర్చిపోలేని గొప్ప అనుభవం. శక్తివంతమైన రఫేల్‌లో ఈ ప్రయాణం దేశ రక్షణ సామర్థ్యాలపై నాకు కొత్త నమ్మకాన్ని, గర్వాన్ని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన భారత వైమానిక దళాన్ని, అంబాలా ఎయిర్‌బేస్ బృందాన్ని అభినందిస్తున్నాను" అని పుస్తకంలో రాష్ట్రపతి రాశారు.

యుద్ధ విమానంలో ప్రయాణించిన మూడో భారత రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము రికార్డుకెక్కారు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం. ఆయన 2006 జూన్ 8న పుణెలో సుఖోయ్-30 ఎంకేఐ విమానంలో ప్రయాణించారు. ఆ తర్వాత 2009 నవంబర్ 25వ తేదీన అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ పుణెలో సుఖోయ్-30 ఎంకేఐలో ప్రయాణించి ఈ ఘనత సాధించిన తొలి మహిళా రాష్ట్రపతిగా నిలిచారు. అయితే, ద్రౌపదీ ముర్ము 2023 ఏప్రిల్ 8వ తేదీన అస్సాంలోని తేజ్‌పూర్ ఎయిర్‌బేస్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐలో, ఇప్పుడు అంబాలా నుంచి రఫేల్‌లో ప్రయాణించి.. రెండు వేర్వేరు రకాల ఫైటర్ జెట్లలో విహరించిన ఏకైక రాష్ట్రపతిగా విశిష్టమైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు.

రఫేల్ పర్యటన సందర్భంగా అంబాలా ఎయిర్‌బేస్‌లో భారత వైమానిక దళం స్క్వాడ్రన్ లీడర్ శివాంగి సింగ్ రాష్ట్రపతి ముర్మును కలిశారు. వారిద్దరి ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన రఫేల్ ఫైటర్ జెట్‌ను కూల్చివేశామని, పైలట్ శివాంగి సింగ్‌ను అదుపులోకి తీసుకున్నామని పాకిస్తాన్ గొప్పలు చెప్పుకుంది. అందులో ఏమాత్రం వాస్తవం లేదని భారత్ తేల్చిచెప్పింది. బుధవారం రాష్ట్రపతి ముర్ముతో శివాంగి సింగ్ ఫొటో బయటకు రావడంతో పాకిస్తాన్ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. శివాంగి సింగ్ ఐఏఎఫ్ గోల్డెన్ ఆరోస్ స్క్వాడ్రన్ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు. దేశంలో ఇప్పటి వరకు మొట్టమొదటి, ఏకైక రఫేల్ మహిళా పైలట్‌గా రికార్డుకెక్కారు.





Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in